క్లుప్తంగా

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే కాలె యాదయ్య



కేసీఆర్‌కు ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే

చేవెళ్ల: సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే కాలె యాదయ్య తిరుమల తిరుపతి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఇటీవల కుటుంబ సమేతంగా ఆయన తిరుమల తిరుపతి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆర్మీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

షాద్‌నగర్‌టౌన్: ఆర్మీలో చేరాలనుకునే వారికి షాద్‌నగర్‌లో స్నైపర్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల యువకులు ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించే 1600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొనాలని తెలిపారు. పోటీల్లో సత్తాచాటిన వారిని ఉచిత శిక్షణకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9493434907 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అన్నదానం.. మహాదానం

ఎస్‌ఎంసీ చైర్మన్ రాములు



రాములు దంపతులను సన్మానిస్తున్న గురుస్వాములు

నందిగామ: అన్నదానం మహాదానంతో సమానమని ఎస్‌ఎంసీ చైర్మన్ రాములు అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ఆయన ఆర్థిక సహాయంతో స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎంసీ చైర్మన్ రాములు మాట్లాడుతూ.. కఠిన నియమాలతో దీక్ష బూనిన అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యఫలమని అన్నారు. అంతకు ముందు ఆలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వాములు అన్నదాత రాములు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు సుదర్శన్‌గౌడ్, నాయకులు కృష్ణ, హెచ్‌ఎం దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు పీహెచ్‌సీకి కొత్త డాక్టర్



తబస్సుమ్ మెహరాజ్

కొందుర్గు: కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్తగా డాక్టర్ తబసుమ్ మెహరాజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం విధుల్లో చేరారు. కొందుర్గులో ఇదివరకు డాక్టర్ అమ్రిత జోసెఫ్ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆమె సెలవులో ఉన్నా, ఏదైనా సమావేశాలకు వెళ్లినా పీహెచ్‌సీలో రోగులకు వైద్య పరీక్షలు చేయడానికి ఇబ్బందిగా ఉండేది. అయితే నూతనంగా మరో డాక్టర్ రావడంతో సమస్య తీరిందని స్థానికులు అంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిఒక్కరూ బీమా చేయించుకోవాలి

ఎస్‌బీఐ మేనేజర్ సరస్వతి



భారతమ్మకు నగదు అందజేస్తున్న మేనేజర్ సరస్వతి

షాబాద్: ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమాను చేయించుకొని బీమాగా ఉండాలని షాబాద్ ఎస్‌బీఐ మేనేజర్ సరస్వతి సూచించారు. బుధవారం ఎల్గొండగూడ గ్రామానికి చెందిన భూర్గుల యాదయ్య కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. ఈతను సురక్ష బీమా యోజన కింద రూ.20లక్షలతో ఇన్సూరెన్స్ చేశాడు. దీంతో అతని భార్య భారతమ్మకు రూ. 2లక్షలు నగదును బ్యాంకు మేనేజర్ సరస్వతి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి సంవత్సరానికి రూ.436 ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన చేసుకుంటే ప్రమాదవశాత్తు వ్యక్తి చనిపోతే రూ.2లక్షల ప్రమాద బీమా వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఫరూక్, బాలకృష్ణ మధుసూదన్, అర్పిత్‌రవి, శివపార్వతీ తదితరులున్నారు.

జోరుగా నీటి వ్యాపారం

మంచినీరు ఇప్పుడు కొనుక్కుంటేనే దొరికే పరిస్థితి వచ్చేసింది. భూగర్భజలాల్లో ఫ్లోరైడ్ శాతం పెరిగిపోవడంతో బోరుబావుల నుంచి నేరుగా వచ్చే నీళ్లను ప్రస్తుతం ఎవరూ తాగడం లేదు. ప్రభుత్వం మిషన్ భగీరథ నీళ్లు సరఫరా చేస్తున్నా చాలా మంది వాటిని తాగడం లేదు. ప్రతి ఒక్కరు ఫిల్టర్ చేసిన నీళ్లనే తాగుతుండడంతో నీటివ్యాపారం జోరందుకుంది. రోజురోజుకు గ్రామాల్లో నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు పెరుగుతూనే ఉంది. వాటిలో నాణ్యతా ప్రమాణాలు పాటించకున్నా, ఆ విషయాన్ని పట్టించుకునే పరిస్థితి లేదు.

- వాటర్ ఫిల్టర్లలో నాణ్యతా ప్రమాణాలు కరువు
- అధికారుల తనిఖీలు శూన్యం



మొయినాబాద్ మండల కేంద్రంలోని ఓ నీటిశుద్ధి కేంద్రం

మొయినాబాద్: మొయినాబాద్ మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపుగా అన్ని గ్రామాల్లో వ్యాపారులు వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామంలో మూడు, నాలుగు నీటి శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. ఇంకా కొంత మంది ఇప్పటికీ కొత్తగా వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. మండలంలో సుమారు 60కిపైగా నీటి శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. ఈ నీటిశుద్ధి కేంద్రాలన్నీ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండానే కొనసాగుతున్నాయి.

జోరుగా వ్యాపారం..

మండలంలో నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. నెలకు సుమారు రూ.కోటి వరకు నీటి వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. మండలంలో ఉన్న 60 నీటి శుద్ధి కేంద్రాల ద్వారా అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి నీళ్లు విక్రయిస్తున్నారు. 20 లీటర్ల నీళ్ల డబ్బాను రూ.15–20 వరకు అమ్ముతున్నారు. మండల పరిధిలో ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. వీటితో పాటు వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వాటన్నింటిలోకి నీటి శుద్ధి కేంద్రాల నుంచే నీళ్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రతి రోజు నీటి వ్యాపారం సాఫీగా సాగుతుంది.

నాణ్యత ప్రమాణాలు కరువు...

నీటి శుద్ధి కేంద్రాల్లో నీటిని శుద్ధి చేయడంలో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదు. దీంతో ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. నీటిశుద్ధి కేంద్రాల యజమానులు బోరు నీటిలో కొన్ని లవణాలను తొలగించి విక్రయిస్తున్నారు. నీటిని శుద్ధి చేసి విక్రయించాలంటే పరిశ్రమల శాఖ అనుమతితో పాటు బీఐఎస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. నీటిని యూవీ కిరణాలతో శుద్ధి చేయాలి. నీటిశుద్ధి కేంద్రంలో కెమికల్, మైక్రో లాబ్‌లు ఉండాలి. నీటిని మూడు దశల్లో శుద్ధి చేయాల్సి ఉంటుంది. మొదట క్లోరినేషన్ చేసి, ఆ తరువాత శాండ్ ఫిల్టర్ చేయాలి. ఆ తరువాత కార్బన్ ఫిల్టర్‌లో 25 మైక్రాన్‌ల కంటే సూక్ష్మస్థాయిలో ఉన్న ఫిల్టర్‌లో వడకట్టాలి. కానీ, చాలా వరకు నీటిశుద్ధి కేంద్రాల్లో ఇవన్నీ పట్టించుకోవడం లేదు. ఖాళీ క్యానన్లను సైతం వేడినీటితో శుభ్రం చేయాలి. అలా చేయకుండా పైపైనే శుభ్రం చేసి వదిలేస్తున్నారు.

అధికారులకు పట్టని వైనం..

మండలంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాలన్నీ నిబంధనలకు విరుద్ధం కొనసాగుతున్నా అధికారులకు మాత్రం పట్టడంలేదు. గత ఐదారు సంవత్సరాలుగా రోజురోజుకు నీటి శుద్ధి కేంద్రాలు పెరుగుతున్నా సంబంధిత అధికారులు తనిఖీ చేసిన దాఖలాలులేవు. కనీసం నీటి శుద్ధి కేంద్రాల్లో శుద్ధి చేసిన నీరు ఏ మేరకు శుభ్రం అవుతుందని కూడా అధికారులు చూడడం లేదు. అసలు అధికారులు నీటిశుద్ధి కేంద్రాల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.

ఐక్యతతో డిమాండ్ల సాధన

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నందిగామ: కార్మికులు తమ హక్కుల సాధనకు ఐక్యంగా ఉండాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. మండల పరిధిలోని మేకగూడ శివారులోని నాట్కో ఫార్మా పరిశ్రమ ఆవరణలో నాట్కో ఇండస్ట్రీ సీఐటీయూ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను యూనియన్ కార్యదర్శి మల్లేష్ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని చెప్పారు. కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసేందుకు కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో విభజిస్తున్నారని ఆరోపించారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండాలని, కార్మికుల హక్కులను విస్మరించే ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబు, రుద్రకుమార్, పలువురు కార్మికుల సంఘం నేతలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో కళాశాల అధ్యాపకులు

షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణ శివారులోని నూర్ కళాశాలలో కొనసాగుతున్న నాగర్‌కర్నూల్ మహిళా గురుకుల కళాశాల విద్యార్థినులు కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో ప్రతిభను కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. బుధవారం గురుకుల కళాశాల ఆవరణలో నిర్వహించిన బెల్టు గ్రేడింగ్ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రేడింగ్ పరీక్షల్లో విద్యార్థినులు శిరేఖ, విజయలక్ష్మి, ఈరమ్మలు ఎల్లో, ఆరెంజ్ బెల్టులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా సాధియా సుల్తానా, ఒగ్గు మనూష, శిరీష, గీత, స్వరూప, రజిత, రేవతి, మమత, స్వప్నలు ఎల్లో బెల్టు సాధించారు. బెల్టులు సాధించిన విద్యార్థినులకు ధ్రువపత్రాలు, బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాలలో అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఎత్తిన చెన్నయ్య, అధ్యాపకులు ఆశాజ్యోతి, హిమబిందు, ఆఫ్రిన్, సుజాత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ న్యాయం చేస్తా



ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసిన రైతులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: భూసేకరణలో అర్హులైన రైతులందరికీ న్యాయం జరిగేలా చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. బుధవారం చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కేతన, ఎంపీటీసీ అరుణ ఎమ్మెల్యేను కలిశారు. మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో సర్వేనంబర్ 311లో గల ప్రభుత్వ భూమిలో హెచ్‌ఎండీఏ వెంచర్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇటీవలే రైతుల నుంచి తీసుకుంది. భూములు ఇచ్చిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుమ్మరిగూడలో 311 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిలో హెచ్‌ఎండీఏ వెంచర్ ఏర్పాటుకు రైతుల నుంచి ప్రభుత్వం భూసేకరణ చేపట్టిందన్నారు. మొదటగా ఎకరాకు 500 నుంచి 600 గజాలు రైతులకు ఇవ్వాలని అధికారుల నిర్ణయించారని చెప్పారు. ఆ స్థలం మాకు సరిపోదని ఇంకా పెంచాలని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్ ఆర్డీఓలతో మాట్లాడి ఎకరానికి 750 గజాలు స్థలం రైతులకు ఇచ్చేలా ఒప్పించడం జరిగిందన్నారు. తన సొంత గ్రామంలా కుమ్మరిగూడ గ్రామంలో కూడా ఎన్నో సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించడం జరిగిందని గుర్తుచేశారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు స్థలాన్ని 750 గజాలకు పెంచడం జరిగిందని చెప్పారు. త్వరలో రైతులందరికీ పట్టా సర్టిఫికెట్లు అందజేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, స్థానిక తహసీల్దార్ సైదులుగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రమేష్, ఆంజనేయులు తదితరులున్నారు.

ఆలయాల ఆస్తుల పరిరక్షణకు కృషి

- బజరంగ్‌దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్ చందర్
- రథశాలను కూల్చొద్దంటూ ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకి వినతి పత్రం అందజేస్తున్న నేతలు

షాద్‌నగర్: దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు అందరు కృషి చేయాలని బజరంగ్‌దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్ చందర్ అన్నారు. పాత జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జానంపేట వేంకటేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన రథశాలను కూల్చొద్దంటూ బుధవారం బజరంగ్‌దళ్ సభ్యులు షాద్‌నగర్ ఆర్డీఓ రాజేశ్వరీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాష్ చందర్ మాట్లాడుతూ.. వనపర్తి సంస్థానాధీశులు కట్టించిన దేవాలయం, రథశాల హిందువుల సంస్కృతికి చిహ్నాలు అని అన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా అధికారులు పురాతనమైన రథశాలను తొలగిస్తామని చెప్పడం సరికాదన్నారు. వేంకటేశ్వరస్వామి దేవాలయానికి నాలుగు వందల ఏళ్ళ చరిత్ర ఉందన్నారు. ఆలయానికి సంబంధించిన రథశాలను కూల్చివేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. దేవాలయాల ఆస్తులు, సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత హిందువులందరిపై ఉందని చెప్పారు. హిందు ధర్మం కోసం దేవాలయాల రక్షణ కోసం ప్రాణాలు అర్పించేందుకైనా తాము సిద్ధమని అన్నారు. అధికారులు పురాతమైన రథశాలను రాత్రికి రాత్రే తొలగిస్తే అదే స్థలంలో మళ్లీ రథశాలను నిర్మిస్తామని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బజరంగ్‌దళ్ విభాగ్ కోకన్వీనర్ గూడెం రమేష్, ప్రఖండ ప్రముఖ్ ప్యాట వంశీ, నాయకులు వినయ్, భరత్, సాయిచరణ్, నరేష్, గణేష్, శివానంద్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు అభివృద్ధికి దిక్సూచిలు



సర్పంచ్‌ను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

సర్పంచ్ ప్రభాకర్

కొత్తూరు: గ్రంథాలయాలు అభివృద్ధికి దిక్సూచిలుగా ఉంటాయని మండలంలోని ఎస్‌బీపల్లి సర్పంచ్ అంబటి ప్రభాకర్ అన్నారు. గ్రామంలో బుధవారం ప్రబోధ సేవాసమితి–ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణప్రబోధ ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు సర్పంచ్‌తో పాటు పలువురు నాయకులను శాలువాలతో సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. త్రైతసిద్ధాంతం ఆధారంగా ఆచార్య ప్రబోధనందా యోగీశ్వరులు వ్రాసిన త్రైతసిద్ధాంత భగవద్గీతతో పాటు గ్రంథాలయంలో 100 రకాల గ్రంథాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మల్లేష్, వెంకటేష్, శ్యాంసుందర్, స్థానికులు వెంకటయ్య, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్, గోపి, నవీన్, నందు, మహేందర్, అర్జునయ్య, కృష్ణయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

మోకిల సర్పంచ్ సుమిత్ర



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శంకర్‌పల్లి: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని మోకిల సర్పంచ్ సుమిత్ర పేర్కొన్నారు. గురువారం శంకర్‌పల్లి మండలంలోని మోకిల క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర క్రీడాపోటీల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కబడ్డీ, ఖోఖో క్రీడాపోటీలకు 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులను జనవరి 28–30వరకు హర్యాన రాష్ట్రంలోని ప్రతాప్ స్పోర్ట్స్ స్టేడియం 9వ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం జరుగుతుంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించి మంచి ప్రతిభను కనబర్చాలని సూచించారు. క్రీడలతో స్నేహభావాలు పెంపొందించడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో యూత్ నేషనల్ అసోషియేషన్ ఆఫ్ తెలంగాణ సెక్రటరీ ప్రేమలత, టోర్నమెంట్ ఆర్గనైజర్ విఠల్, పీఈటీలు రాజు, పద్మజ, మధురస్మ్రప, శ్రీనివాస్, తరుణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

చెరువులో నీళ్లు తీయొద్దని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పర్వతాపూర్ గ్రామస్తులు

కొందుర్గు: కొందుర్గు మండలం తంగెళ్లపల్లి మంగళి చెరువులో నుంచి నీళ్లు తీయకూడదని బుధవారం మండలంలోని పర్వతాపూర్ గ్రామస్తులు తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా చెరువు నిండకపోవడం వల్ల భూగర్భజలాలు అడుగంటి పోయి పరిసర గ్రామాల్లో, వ్యవసాయ పొలాల్లో బోరుబావులు ఎండిపోయాయన్నారు. కనీసం తాగడానికి నీళ్లు కూడా దొరకని దుస్థితి ఏర్పడిందని, ప్రస్తుతం రెండేళ్లుగా వర్షాలు పుష్కలంగా కురవడంతో చెరువు నిండిందన్నారు. బోరుబావుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన ఆయకట్టుదారులు చెరువులో నుంచి నీళ్లు తీయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందని, నీళ్లు తీయడం వల్ల తిరిగి బోరుబావులు ఎండిపోతాయని వాపోయారు. చెరువులో నుంచి నీళ్లు తీయకుండా తమకు న్యాయం చేయాలని పర్వతాపూర్ గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంజుల, గ్రామస్తులు యాదయ్య, అంజయ్య, కృష్ణయ్య, నరేష్, నర్సింలు ఉన్నారు.

అవేర్ సంస్థ సేవలు అభినందనీయం

ఎంపీపీ రఘుమారెడ్డి



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మహేశ్వరం: గ్రామీణా ప్రాంత పేదలకు అవేర్ సంస్థ వారు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆకన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలున్నవారు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకొని వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ప్రతి రోజు వాకింగ్, యోగా, ధ్యానం, వ్యాయమం చేస్తే ఆరోగ్యంగా ఉండడడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గ్రామాలు, గిరిజన తండాలు, అనుబంధ గ్రామాల్లో అవేర్ సంస్థ వారు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం పట్ల అభినందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఆకన్‌పల్లి గ్రామానికి ఉచిత వైద్యం, రోగులకు మందులతో పాటు బోర్ మోటర్‌ను అవేర్ సంస్థ వారు అందజేయడం అభినందనీయమన్నారు. అంతకు ముందు వైద్య శిబిరంలో 169 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆకన్‌పల్లి సర్పంచ్ ముక్కెర యాద య్య, ఉప సర్పంచ్ గురుప్రీత్, అవేర్ సంస్థ మేనేజర్ వరుణ్, కార్యానిర్వాహక అధికారి వెంకన్న, పలు వురు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



రసీదు తీసుకుంటున్న వెంకటేశ్ యాదవ్

షాద్‌నగర్: కేశంపేట మండల పరిధిలోని బైర్‌ఖాన్‌పల్లి గ్రామంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్నస్వామి దేవాలయం నిర్మాణానికి బుధవారం పలువురు ఆలయ కమిటీ సభ్యులకు విరాళాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ బైకని వరమ్మ వెంకటేష్‌యాదవ్ రూ.1,00116, బైకని శివకుమార్ యాదవ్ రూ.50,116, రాజునాయక్ రూ.11వేలు, జూకల్లు మల్లేష్‌యాదవ్ రూ.11వేలు, సిద్ధాపూర్ గ్రామానికి చెందిన ఎల్లారం కృష్ణారెడ్డి 50బస్తాల సిమెంట్‌ను విరాళంగా అందజేశారు.

ఆదర్శప్రాయుడు లూయిస్ బ్రెయిలీ

ఎన్‌పీఆర్‌డీ జిల్లా కోశాధికారి దేవరపల్లి రాజశేఖర్‌గౌడ్



బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: అంధులు జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీని అందరు ఆదర్శంగా తీసుకోవాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా కోశాధికారి దేవరపల్లి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. వికలాంగుల జాతీయ హక్కుల వేదిక (ఎన్‌పీఆర్‌డీ)ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ బాల్యంలోనే ప్రమాదవశాత్తు రెండు కళ్లను కోల్పోయాడని అన్నారు. లూయిస్ తన నాలువ ఏటా చదువుకునేందుకు పాఠశాలకు వెళ్లి చదువుల్లో అసాధారణ ప్రతిభను కనబరిచాడని చెప్పారు. అంధులు చదువుకునేందుకు వీలుగా లిపిని తయారు చేసి వారి జీవితాల్లో బ్రెయిలీ వెలుగులు నింపాడని తెలిపారు. బ్రెయిలీ భావితరాలకు చిరస్మరణీయుడని కొనియాడారు. ప్రభుత్వం అంధులు, వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ సంఘం నాయకులు కుసుమ, మనీల, శేఖర్‌గౌడ్, శంకర్, పాల్గొన్నారు.

రాష్ట్రపతిని కలిసిన బీజేపీ నాయకులు



రాష్ట్రపతి ద్రౌపదిముర్మును కలిసిన బీజేపీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదిముర్మును బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కనర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్మును రాష్ట్రపతి భవన్‌లో కలిసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని గిరిజన జీవన విధానం, జీవనోపాధి తదితర విషయాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రపతిని కలిసిన వారిలో బీజేపీ నేతలు అంజన్‌కుమార్‌గౌడ్, శ్రీవర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బుక్కవేణుగోపాల్, శ్రీధర్, వెంకటయ్య, సుజాత చంద్రయ్య తదితరులు ఉన్నారు.